సొసైటీ నిర్వహణ కోసం నిధులు సమీకరించుకోవాలి

సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి

బంజారాహిల్స్: గత పాలక మండలి ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కారణంగా ఆదాయ పన్ను శాఖలకు భారీ మొత్తంలో పన్ను చెల్లించాల్సి ఉంటుందని, ఈ విషయంపై గతంలోనే సంబంధిత శాఖలతో చర్చలు జరిగాయని సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని వెంకటేశ్వర కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ(ఎమ్మెల్యే కాలనీ) సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ఒక వేళ ఆదాయ పన్ను శాఖ నుంచి సొసైటీకి వ్యతిరేకంగా నిర్ణయం వస్తే సొసైటీ అకౌంట్స్‌లో ఉన్న రూ. 51 లక్షలు పన్నుగా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. సొసైటీ నిర్వహణ కోసం కాలనీవాసుల సమస్యల పరిష్కారం కోసం నిధుల సమీకరణ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సొసైటీ సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గతంలో ఏప్రిల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశానికి జరిగిన మినిట్స్ ఆఫ్ మీటింగ్‌ను నిర్ధారించారు. కాలనీలో మెయింటెనెన్స్ పనులను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. దీని కోసం కొంత రుసుము పెట్టాలని ప్రతిపాదనలను సమావేశం ముందుంచారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ రోజారాణి, సొసైటీ ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్ రెడ్డి, కోశాధికారి సరళ రాజ్యలక్ష్మి, రమేష్ రెడ్డి, లింగయ్య, విజయ్‌కుమార్, ప్రతిమ, రిధిమ, ఆజంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతి, కళలను భావితరాలకు అందించాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మామిడి హరికృష్ణ

శ్రీనగర్‌కాలనీ: మన కళలు ప్రాచీనమైనవని మన సంస్కృతి, కళలను భావితరాలకు అందించాలని తెలంగాణా బాషా, సాంస్కృతికశాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం అమీర్‌పేట కమ్మ సంఘంలో భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ అండ్ ఆర్ట్స్ తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాట్యమార్గంలో పేరిట 30రోజుల సైద్ధాంతిక కూచిపూడి నాట్య శిక్షణా శిబిరాన్ని మామిడి హరికృష్ణ ప్రారంభించారు. నేటి యువతకు మన కూచిపూడి నృత్య కళలోని విశేషాలను విపులంగా వివరిస్తూ ఈ శిక్షణా శిబిరం ఉంటుందని, ఔత్సాహికులు ఈ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ నాట్య గురువులు కోకా విజయలక్ష్మి, జి.రవి, మధుమతి కులకర్ణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ డాక్టర్ సంగనబట్ల నరసయ్య, డాక్టర్ కె.సూర్య, ఎం.మణిమాల పాల్గొన్నారు.

అక్రమ బోర్ సీజ్



రహమత్‌నగర్: రహదారిపై అక్రమంగా వేస్తున్న బోర్‌ను ఖైరతాబాద్ మండల ఆర్ఐ కిరణ్‌రాజ్ ఆదివారం సీజ్ చేశారు. రహమత్‌నగర్ అమూల్ బేకరి సందులో ఓ వ్యక్తి దారిపై బోరు వేస్తున్నాడని అధికారులకు ఫిర్యాదు రావడంతో తహసీల్దార్ నయీమొద్దీన్ ఆదేశాల మేరకు ఆర్ఐ కిరణ్‌రాజ్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి బోర్, బోర్ వేసే వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అనుమతితోనే బోర్ వేసుకోవాలని సూచించారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

వైద్యులు లేరు.. మందు బిళ్లలు లేవు..!

- ఒక్క నర్సుతోనే నెట్టుకొస్తున్న వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ప్రభుత్వాసుపత్రులపై చిన్నచూపు
- ఇదీ షౌకత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి దుస్థితి

మూడు నెలలుగా ఖాళీగా ఉన్న వైద్యుడి పోస్టు

పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుప్రతులు దేవాలయాలతో సమానం. ఎందుకంటే వీరికి ప్రైవేటు ఆస్పత్రిలకు వెళ్లే ఆర్థిక స్తోమత ఉండదు. అందుకే ఎంత పెద్ద రోగమొచ్చిన ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు పొందుతారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఇంతటి ప్రాధాన్యమున్నా పాలకుల నిర్లక్ష్యం, కొందరు అధికారుల అలసత్వంతో ఆసుపత్రుల్లో సరైన వసతులు, వైద్యులు, సిబ్బంది లేక ఆసుపత్రులకు వచ్చే రోగులు నానా అవస్థలు పడుతున్నారు.

బంజారాహిల్స్: నిత్యం ప్రభుత్వ ఆస్పత్రులకు ఎంతో మంది రోగులు జ్వరాలు, దగ్గు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో నిత్యం వస్తుంటారు. అయితే ఈ రోగులకు వైద్యం అందించే వైద్యాధికారి లేకపోతే ఆ రోగుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని షౌకత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే కళ్లకు కడుతుంది. పేద, మధ్య తరగతి ప్రజలకు రోగాలను బాగు చేసే సర్కార్ ఆస్పత్రుల్లో గత మూడు నెలలుగా వైద్యాధికారి లేకపోవడంతో ఉన్న ఒక్క నర్సుతోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ ఆస్పత్రికి 50-60 మంది పేషెంట్లు వస్తుంటారు. అలాగే గర్భిణులు, చిన్నారులకు టీకాల కోసం తల్లులు నిత్యం క్యూలు కడతారు. వీరి బాగోగులు చూడాల్సిన డాక్టర్ పోస్టు నెలల తరబడి ఖాళీగా ఉండగా భర్తీ చేయడంలో ఉన్నతాధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ ఆసుపత్రిలో ఐదు మంది నర్సులు ఉండాల్సిన చోట ఒకరితోనే నెట్టుకొస్తున్నారు. అంతేకాకుండా సిబ్బంది కూడా లేక నాణ్యమైన వైద్యసేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు జ్వరమొస్తే మందు బిళ్లలు కూడా లేకపోవడంతో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. బీపీ, షుగర్ ట్యాబ్లెట్లు కూడా లేవని ఇక్కడి సిబ్బంది రోగుల ముఖంపైనే చెప్పేస్తున్నారు. ఇటు వైద్యులు లేక..అటు సిబ్బంది లేక..మరోవైపు మందు బిల్లలు లేక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల కాలంలో ఈ ఆస్పత్రి నిర్వహణ, నిర్వాకంపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ఆదివారం ఆమె ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. దీంతో ఆసుపత్రిలో ఒకే ఒక్క నర్సు అన్ని పనులు తానే చేస్తున్నట్లుగా ఆమె గుర్తించారు. ఇదేమి దుస్థితి అని వైద్య శాఖ అధికారిణి విజయనిర్మలకు అక్కడి నుంచే ఫోన్ చేశారు. నెలల తరబడి డాక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నా పట్టించుకోరా? అని నిలదీశారు. కనీసం బీపీ, షుగర్ ట్యాబ్లెట్లు కూడా అందుబాటులో లేకుంటే వ్యాధులు ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. సాధ్యమైనంత త్వరగా ఈ ఆస్పత్రిలో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



ఆరోగ్య కేంద్రంలో ఇక్కట్లు పడుతున్న రోగులు

ప్రభుత్వ ఆస్పత్రులపై ఇంత నిర్లక్ష్యమా..?



ప్రభుత్వ ఆస్పత్రులు అంటే, ఇక్కడికి వచ్చే పేద, మధ్యతరగతి రోగులంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపుగా ఉంది. సర్కార్ ఆస్పత్రులపై ఇంత నిర్లక్ష్యాన్ని నేనెప్పుడూ చూడలేదు. అటు వైద్యులు లేక, ఇటు మందులు లేక ఆస్పత్రి కునారిల్లుతోంది. ఆస్పత్రిలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. పరిశుభ్రత లేకపోవడంతో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. నిర్వహణ పూర్తిగా కొరవడింది. రోజుకు నాలుగైదు ఫిర్యాదులు ఈ ఆస్పత్రిపై అందుతున్నాయి. వెంటనే డాక్టర్‌ను, సిబ్బందిని నియమించి మందులు అందుబాటులో ఉంచకపోతే వైద్యశాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేయనున్నాం.

– మన్నె కవితారెడ్డి, కార్పొరేటర్

భార్యాభర్తలపై దాడి

వెంగళరావునగర్: భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... రహమత్‌నగర్ ప్రాంతానికి చెందిన సంపూర్ణ, నాగరాజు దంపతులు ఈనెల 26వ తేదీ రాత్రి సంపూర్ణ సోదరి ఇంటి నుంచి తమ గృహానికి వెళ్ళడానికి న్యూటన్ హైస్కూల్ వద్ద ఉన్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి రోడ్డుపై ఎందుకు ఉన్నావని నాగరాజును ప్రశ్నించారు. దీంతో యువకులకు నాగరాజుకు వాగ్వాదం చోటుచేసుకోగా వారు నాగరాజుపై దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన సంపూర్ణపై కూడా దాడి చేశారు. భార్యాభర్తలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో ల్యాప్‌టాప్ మాయం

వెంగళరావునగర్: బస్సులో ప్రయాణికుడి ల్యాప్‌టాప్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కడప ప్రాంతానికి చెందిన పి. ఉదయ్‌కుమార్ స్థానిక ఆల్వాల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. శనివారం రాత్రి కడప నుంచి నగరానికి బస్సు ఎక్కి ఉదయం అమీర్‌పేటలో బస్సు దిగాడు. అనంతరం తన బ్యాగ్ కోసం వెతకగా ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్ కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు బెదిరింపులు

వ్యక్తిపై కేసు నమోదు

వెంగళరావునగర్: తనను పెళ్ళి చేసుకోకపోతే కుమారుడిని, కోడలిని చంపుతానని మహిళను బెదిరించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... దేవులబాయి సినీ పరిశ్రమలో పని చేస్తుంది. ఆమెకు తనకు తెలిసిన స్నేహితుడు వల్కి ద్వారా కాళిదాస్ పరిచయం అయ్యాడు. గత సెప్టెంబర్‌లో ఆమె ఆరురోజులు (మూడురోజులు యాక్టింగ్, మరో మూడురోజులు డబ్బింగ్) పని చేసింది. ఇందుకు సంబంధించి డబ్బులు అడగ్గా కాళిదాస్ నిరాకరించాడు. అంతేగాకుండా తనను పెళ్ళి చేసుకోవాలని లేదంటే ఆమె కుమారుడిని, కోడలును చంపుతానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసాలపై ఆకట్టుకున్న వీధినాటకం



బంజారాహిల్స్: హైదరాబాద్‌లో నవంబర్ 6న జరగనున్న సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్-2.0 సన్నాహక కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ జీవీకే మాల్ వద్ద నిర్వహించిన వీధి నాటకం ఆలోచింపజేసింది. సైబర్ సెక్యూరిటీ సమస్యలపై ఈ నాటకం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించి అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌లు విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రజల్లో చైతన్య తీసుకురావడం ద్వారా అరికట్టవచ్చన్న లక్ష్యంతో హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా ఫేక్ స్కీమ్స్, దొంగతనాలు, ఓటీపీ/యూపీఐ మోసాలు, తదితర డిజిటల్ ప్లాట్‌ఫాం అంశాలపై ప్రజలు ఏవిధంగా మోసపోతున్నారనే దానిపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, వెబ్‌సైట్ వివరాలను ప్రేక్షకులకు అందించారు. నవంబర్ 2న సాయంత్రం 6.30 గంటలకు ప్రసాద్ ఐమ్యాక్స్ వద్ద కూడా వీధినాటకం ప్రదర్శించనున్నట్లు హెచ్‌సీఎస్‌సీ ప్రతినిధులు తెలిపారు.

ప్రార్థించే పెదవులు కన్నా.. సాయం చేసే చేతులు మిన్న

బసవతారకంలో అన్నదానం

బంజారాహిల్స్: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న స్ఫూర్తితో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ముందుకు సాగుతుందని సినీనటుడు శేఖర్ భాష అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ వద్ద రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు శేఖర్ భాష హాజరై మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా గత పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎందరికో అండగా నిలుస్తున్న ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పెద్ది శంకర్‌గౌడ్‌కు అభినందనలు తెలియజేశారు. రోగులు, వారి వెంట వచ్చే సహాయకులకు ప్రతి ఆదివారం ఆహారాన్ని అందించడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్చన, డాక్టర్ సంతోష్, కో-ఆర్డినేటర్ ప్రకాష్, లక్ష్మణ్, చైతన్య, ప్రవీణ్, నితిన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సమన్యాయం కోసం తపనపడిన వ్యక్తి లక్ష్మణ్‌రావు

లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ




నివాళులర్పిస్తున్న అర్పిస్తున్న జయప్రకాశ్ నారాయణ

ఖైరతాబాద్: ఏ హోదాలో ఉన్నా సామాజిక సేవ, సమాజహితం కోసం కృషి చేయడంతో పాటు సమన్యాయం కోసం తపనపడే గొప్ప వ్యక్తి అంబటి లక్ష్మణ్‌రావు అని వక్తలు కొనియాడారు. ఆదివారం జలవిహార్‌లో దివంగత మాజీ జస్టిస్ డాక్టర్ అంబటి లక్ష్మణ్‌రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, రిటైర్డ్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ హోదాలో ఉన్నా సమాజం కోసం కృషి చేశారని, అందరికి సమన్యాయం చేయాలని తపన పడేవారన్నారు. ఆయన నిజాయితీకి నిలువుటద్దమని, ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగినా మానవత్వ విలువలతో లోతుగా ఆలోచించే వ్యక్తి గుర్తుచేశారు. ఆయన పుట్టిన గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, వెల్లలూరు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని, అప్పట్లోనే మద్యపాన నిషేధం చేపట్టారని ఇప్పటికి అలాగే కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మినారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ భీంరెడ్డి, రిటైర్డ్ జస్టిస్‌లు గ్రంధి భవానిప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన

రహమత్‌నగర్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నదని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు లంకల దీపక్ రెడ్డి అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆ పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ నేతృత్వంలో ఆదివారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో లంకల దీపక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. నగర నాయకులు బంగారు ప్రశాంత్, సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ.రాంధారి బాబు, నాందేడ్ కాశీ పాల్గొన్నారు.



ఆర్టీఐ కమిషనర్లను నియమించాలి



సమావేశంలో జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు

కాచిగూడ: సమాచార హక్కు చట్టం కమిషనర్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నియమించాలని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్ కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం-2005 ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. ఆర్టీఐ కమిషనర్లను నియమించకపోతే వేలాదిమంది కార్యకర్తలతో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆర్టీఐ కమిషనర్లు లేక కార్యాలయాల్లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, సూర స్రవంతి, వెంకటేశం, గుండెల రాయుడు, వెంకటేష్, సినీహీరో కిరణ్, ఫిల్మ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీఆర్, చింతల రాఘవేందర్, గంగా ప్రియా రెడ్డి, ఎడ్ల అనిత, గౌరవేని సుమన్, వినయ్‌కుమార్, భానుప్రసాద్, లక్ష్మణ్ తదితరులున్నారు.

చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న దుర్గా భవానీ నగర్ సంక్షేమ సంఘం నేతలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.5 దుర్గా భవానీనగర్ బస్తీ సంక్షేమ సంఘం నేతలు పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా దీపావళికి తమ బస్తీను శుభ్రంగా ఉంచేందుకు సహకరించి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తున్నదని బస్తీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు వి. గౌడ్‌నాయక్, ఉపాధ్యక్షుడు ఆర్. గౌడ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి జానీ నాయక్, కోశాధికారి వి. రమేష్ నాయక్, శ్రీను నాయక్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన అవసరం

వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.యశోద



వెంగళరావునగర్: సమాజంలోని ప్రతి ఒక్కరికి ఆయుర్వేదంపై అవగాహన అవసరమని ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.యశోద తెలియజేశారు. ఈనెల 29న జరగనున్న ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.యశోద మాట్లాడుతూ ప్రపంచానికి వైద్య విధానాలను తెలియజేసింది మన దేశ ఆయుర్వేదమేనని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యం మన దేశంలో మాత్రమే పుట్టి ఎన్నో ప్రపంచ దేశాలకు విస్తరించిందని పేర్కొన్నారు. తొలుత ఎర్రగడ్డ ఆయుర్వేద కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమై ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, కళ్యాణ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్లకార్డులతో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ మమత కస్తూరి, సీనియర్ వైద్యులు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ఉమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య



సాయిసుదీప్‌రెడ్డి మృతదేహం

బంజారాహిల్స్: భవనం పైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌కాలనీలోని శ్రీసాయిరామ్ మనోర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడి పెద్ద కొడుకు సాయిసుదీప్‌రెడ్డి(21) మహేంద్ర యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే శ్రీనివాస్‌రెడ్డి మధురానగర్‌కు మారాడు. ఈ నెల 24న సాయిసుదీప్‌రెడ్డి స్నేహితులతో కలిసి తన బర్త్‌డే వేడుకలు జరుపుకున్నాడు. 26న సాయంత్రం అతను తన స్నేహితులతో కలిసి సాయిరామ్ మనోర్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. 5.30 సమయంలో తన స్నేహితుడు మనీష్‌తో పాటు మరో ఇద్దరితో కలిసి టెర్రస్ పైకి వెళ్లాడు. వారితో మాట్లాడుతున్న సాయిసుదీప్ సూర్యాస్తమయం చాలా బాగుంది చూడాలని వారి దృష్టి మరల్చి ఐదో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గత రెండు రోజులుగా తన కుమారుడు మూడీగా ఉంటున్నాడని, తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతున్నాడని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే వచ్చినా కాపాడుకోలేకపోయాడు..

కరాటే కోచ్‌పై దాడి, తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: పాత కక్షలతో ఓ కరాటే కోచ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..దమ్మాయిగూడకు చెందిన ఎండీ జహంగీర్ కరాటే కోచ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న అతను యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ నిర్వహిస్తుండగా అక్కడికి వచ్చిన పహాడీషరీఫ్‌కు చెందిన హఫీజ్, ఎజాజ్, ఒమర్‌బిన్, అహ్మద్, షేక్ సల్మాన్ అతడితో గొడవపడి తీవ్రంగా కొట్టారు. దీంతో గాయపడిన జహంగీర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఆయన చూపే పేదవాడికి వెన్నల వెలుగు...
ఆయన నవ్వే బీదవాడికి కొండంత అండ ఆయన మనసే అభాగ్యులకి భరోసా...
రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి
జన హృదయ నేత
శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
మువ్వా విజయ్ బాబు
ఆర్. రఘురాం రెడ్డి
ఖమ్మం పార్లమెంటు సభ్యుడు
శ్రీ రఘునాథ్ యాదవ్
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు
శేరిలింగంపల్లి నియోజకవర్గం